క్లుప్తంగా

ఘనంగా స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న పాత మిత్రులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక కెనాల్ రోడ్డులోని గాంధీ స్కూల్‌లో ఓల్డ్ స్టూడెంట్స్ కలయిక ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. పాఠశాలలో వివిధ సంవత్సరాల్లో చదివిన మిత్రులంతా కలుసుకుని ఒకరికొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. చదువుకునే రోజుల్లో చేసిన చిలిపి చేష్టలను గుర్తుచేసుకున్నారు. తొలుత స్నేహితుల దినోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాటి మిత్రుల్లో కొందరు రక్తదానం చేసి సామాజిక సేవలో కూడా తాము ముందుంటామని నిరూపించుకున్నారు.

ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ ఏర్పాటు



సిటీ పాస్టర్స్ అసెంబ్లీ నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కలిపి సిద్ధాంత భేదాలు లేకుండా ఉండేందుకు నూతనంగా సిటీ పాస్టర్స్ అసెంబ్లీగా ఏర్పడినట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక గవరవరంలోని ఫ్రెండ్స్ ఆఫ్ గాడ్ చర్చిలో సమావేశమై సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ చీఫ్ ప్యాట్రన్‌గా బిషప్ కారుపాటి శాంతి సాగర్, బిషప్ జి.సుభద్రరావు, పి.జీవన్ కుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా కె.సుదర్శన్ బాబు, కార్యదర్శిగా ఇ.రత్న ప్రసాద్, కోశాధికారిగా జోసఫ్ చిక్కాల, ఉపాధ్యక్షులుగా కె.జీవానందం, జి.జాన్ పీటర్, ఇ.గ్రేస్ జాన్, జాయింట్ సెక్రెటరీగా టి.ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా శేఖర్ బాబు, బి.జోసఫ్, ఎస్ దాసు, ఆదామ్ సురేష్, ఎం ప్రశాంత్ బాబు, జేమ్స్ విజయ్ కుమార్, జి.ఏసు పాదం నియమితులయ్యారు.

కరెంటు కోత... ఉక్కపోత

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రోజూ గంటన్నర కరెంటు కోత విధిస్తున్నారు. అనధికారిక కరెంటు కోత వల్ల గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రివేళల్లో కరెంటు కోతల వల్ల గృహ వినియోగదారులు, వైద్యశాల సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ గంట నుంచి గంటన్నర వరకూ కరెంటు కోత విధిస్తే జనవరి నుంచి జూన్ వరకు ఎన్ని గంటలు కరెంటు కోత ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాడు అందలం.. నేడు నిర్లక్ష్యం

- కార్పొరేషన్ టీచర్లకు పదోన్నతులు, బదిలీలు లేవు
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇక్కట్లు
- మధ్యాహ్న భోజన వర్కర్లకు బెదిరింపులు
- ఏలూరు నియోజకవర్గంలో 11 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- విద్యార్థి మిత్ర పుణ్యం గత ప్రభుత్వానిదే



ఏలూరులోని నరసింహ స్పెషల్ మున్సిపల్ స్కూల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. 2019 నుంచి చేపట్టిన ప్రతి కార్యక్రమం, తలపెట్టిన ప్రతి పథకమూ నిరాటంకంగా కొనసాగేందుకు నిధుల వరద పారించారు. 2019 నుంచి 2023వ సంవత్సరం వరకు ఎన్నెన్నో శిఖరాలను అధిరోహించిన ప్రభుత్వ విద్య టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కావస్తున్నా విద్యారంగ అభివృద్ధిపై కనీస చర్యలు తీసుకోలేని దుర్భర పరిస్థితిలో నెలకొంది. ఏలూరు కార్పొరేషన్ టీచర్లకు పదోన్నతులు, బదిలీలు లేవు. నియోజకవర్గంలో 11 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఖాళీగా 88 ఉపాధ్యాయ పోస్టులు

ఏలూరు కార్పొరేషన్‌లో పరిధిలో మొత్తం 517 ఉపాధ్యాయ పోస్టులకు 88 ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయులకు కొన్నేళ్లుగా బదిలీలు చేపట్టకపోవడం, పదోన్నతులు కల్పించకపోవడంతో అర్హులైన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. మున్సిపాలిటీలను, నగరపాలక సంస్థలను ఒక యూనిట్‌గా పరిగణించి బదిలీలు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు అసలు పీఎఫ్ ఖాతానే లేకపోవడం వారిని తీవ్రంగా బాధిస్తోంది. మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల్లో స్కూల్ అసిస్టెంట్ల కొరత కూడా ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని పెంచుతోంది.

మధ్యాహ్న భోజన వర్కర్లకు బెదిరింపులు

నియోజకవర్గంలో కొన్ని పాఠశాలల్లో టీడీపీ కూటమి నేతల నుంచి మధ్యాహ్న భోజన వర్కర్లకు బెదిరింపులు వస్తున్నాయని వాపోతున్నారు. ఆ పనుల నుంచి వారిని తప్పుకోవాలని, లేని పక్షంలో మధ్యాహ్న భోజన తయారీ, నాణ్యతలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేసి జీతాలు, బిల్లులు రాకుండా చేస్తామని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ప్రస్తుతం పని చేస్తున్నవారే కావాలని, వారి వంటలు శుచిగా, ఆరోగ్యకరంగా ఉంటున్నాయని స్థానిక నాయకులకు చెప్పడంతో వారు కొంత తగ్గినట్టు తెలిసింది.

విద్యార్థి మిత్ర ఘనత గత ప్రభుత్వానిదే

నియోజకవర్గంలో నూరుశాతం విదార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగానికి ఒక్క రూపాయి కూడా విదల్చక పోయినా విద్యార్థులకు ఈ ఏడాది పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారం, షూ, టై, సాక్సులు, డిక్షనరీలు వంటి విద్యా విషయక వస్తువులను నూరుశాతం అందించగలిగారంటే అది గత ముఖ్యమంత్రి జగన్ చలవతోననే చెప్పాలి. గత నవంబర్ నుంచే విద్యాకానుక కిట్లు అందజేయడానికి ఆ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు కారణంగానే సమయానికి కిట్లు విద్యార్థులకు అందాయి. లేదంటే ఈ ఏడాదికి తల్లికి వందనంలానే ఈ కిట్లను కూడా ఇవ్వలేక చతికిలపడే పరిస్థితి ఏర్పడేదని తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు 11

ఏలూరు నగరంలోని 65 ప్రభుత్వ పాఠశాలల్లో 8,295 మంది, ఏలూరు రూరల్ మండలంలోని 57 పాఠశాలల్లో 6,613 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా ఏలూరు నియోజకవర్గంలో 11 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఏలూరు నగరంలో 6, రూరల్ మండలంలో 5 పాఠశాలలు ఉన్నాయి. ఏలూరు నగరంలోని కొత్తపేట నవయుగ నగరపాలక ప్రాథమిక పాఠశాలల్లో ఒకే టీచర్ మూడు తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తూ పాఠ్యాంశాలు బోధించాల్సిన పరిస్థితి ఉంది. తంగెళ్లమూడి రామలింగేశ్వర స్పెషల్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సైతం ఒకే ఉపాధ్యాయురాలు మూడు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో పెట్టి బోధిస్తున్నారు. ఇలాంటివి ఏలూరు నియోజకవర్గంలో అనేకం దర్శనమిస్తున్నాయి. మూడు తరగతుల విద్యార్థులకు బోధించడం ఉపాధ్యాయులకు భారంగా పరిణమిస్తుండగా, మరో పక్క విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు కుంటుపడుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దినెలల క్రితం కలకుర్రు పాఠశాల ఉపాధ్యాయుడు మృతి చెందడంతో ఆయన స్థానంలో నేటికీ అధికారులు ఉపాధ్యాయుడిని నియమించలేదు.

ఫిర్యాదులు వస్తే పరిష్కరిస్తాం



ఏలూరులో మధ్యాహ్న భోజన కార్మికులకు బెదిరింపులు మా దృష్టికి రాలేదు. ఇప్పటి వరకు అటువంటి ఘటనలపై ఫిర్యాదులు అందలేదు. ఫిర్యాదులు వస్తే పరిష్కారానికి కృషి చేస్తాం. కలకుర్రు పాఠశాల ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు డిప్యూటేషన్ వేశాం. ఆయన అక్కడ పని చేస్తూ మృతి చెందారు. ప్రస్తుతం కలకుర్రు పాఠశాలలో బోధనకు ఒక మినిమమ్ టైమ్‌స్కేల్ ఉపాధ్యాయుని నియమించాం. బోధనకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశాం. – ఆర్ రంగయ్య, ఎంఈఓ–2

డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేయాలి



జీఓ నెంబర్ 117ని రద్దు చేసి ప్రాథమిక పాఠశాల వ్యవస్థను 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలి. జీఓ 117 రద్దు ద్వారా ఏర్పన్నమయ్యే అదనపు పోస్టులను కూడా ప్రస్తుత డీఎస్సీ ద్వారానే భర్తీ చేయాలి. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన కొనసాగించాలి. జనవరి నెల నుంచి ఇప్పటి వరకూ ఎంతోమంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఖాళీ అయిన స్థానాలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. – బి.రెడ్డి దొర, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

105 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఏలూరు లైన్స్ క్లబ్ విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీఎస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు పీఆర్‌వీ ప్రవీణ్ కుమార్, నాగ రామకృష్ణ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని లయన్స్ మాజీ జిల్లా గవర్నర్ వేమా కోటేశ్వరరావు ప్రారంభించారు. 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లవల్లి చలపతిరావు, కార్యదర్శి కంది బాలకృష్ణ, కోశాధికారి తమ్మన సాయి కృష్ణ సుహాస్, రీజియస్ చైర్మన్ యు.రత్నకుమార్, జోన్ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, కేఎస్ఆర్ కుమార్, వేమా రామచంద్రరావు, కె.నర్సింహారావు, ఊర రామకృష్ణ పాల్గొన్నారు.

అవార్డు బాధ్యతను పెంచింది

దెందులూరు: తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 30 వేల మందికి రక్తాన్ని దాతల సహకారంతో అందించామని, రక్తదానంలో విశేష కృషిని గుర్తించి తనకు జాతీయ అవార్డు, బంగారు నంది ప్రదానం చేశారని, ఈ అవార్డులు మరింత బాధ్యత పెంచిందని ఏపీ సీఆర్‌డీఏ డివిజనల్ అధికారి సొంగా రవీంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం నాగన్నగూడెం విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తం కావాల్సి వస్తే గంటలోపే వారికి రక్తం సరఫరా చేస్తామన్నారు. ఒకవైపు సీఆర్‌డీఏ డివిజనల్ అధికారి విధులు నిర్వహిస్తేనే సామాజిక సేవా దృక్పథంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో అవసరమైన వారికి దాతల సహకారంతో రక్తాన్ని అందిస్తున్నామన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని దీనిపై యువకులను చైతన్యవంతం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తన విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ రవీంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

'బీజేపీ విధానాలను ఎండగడతాం'



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ప్రజా క్షేత్రంలో కమ్యూనిస్టు పార్టీ తమ బాధ్యత గుర్తెరిగి ప్రజల పక్షాన పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీయాలని బీజేపీ లాంటి మతోన్మాద పార్టీలు చూస్తున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ప్రతిపక్ష నేతలు, రాజకీయ నాయకులపై భౌతిక దాడులు చేయిస్తోందని ఆరోపించారు. కేరళ రాష్ట్రం వయనాడ్ దుర్ఘటనపై ప్రపంచమంతా మానవతా దృక్పథంతో స్పందిస్తుంటే కేవలం రాజకీయ స్వలాభం కోసం బీజేపీ ప్రభుత్వం కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వంపై బురద చల్లే రాజకీయాలు చేస్తుందని ధ్వజమెత్తారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కమ్యూనిస్టు పార్టీ చిత్తశుద్ధితో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోందని వివరించారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చలసాని రామారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని మాట్లాడారు. జిల్లాలోని సీపీఐ అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాలమ్మ దర్శనం



నూకాలమ్మవారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాసం అమావాస్య, ఆదివారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సహాయ, సహకారాలతో అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలను ప్రారంభించి మాట్లాడారు. అమ్మవారికి పుట్టినింటి సారెగా స్థానిక కొత్తపేట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి 324 మంది మహిళ భక్తులచే 108 రకాల స్వీట్స్, ఫ్రూట్స్, వండిన పిండి వంటలను భారీ ఊరేగింపు మధ్య అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారని అర్చకుడు మంత్రవాది రామకృష్ణ తెలిపారు.

ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలి

వేలేరుపాడు: భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, చట్టాలు పూర్తిగా అమలు అవ్వాలంటే ఆదివాసులందరూ ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ధర్మల రమేష్ పిలుపునిచ్చారు. వేలేరుపాడు మండల కేంద్రంలో ఏఎస్‌పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆదివాసీ, గిరిజన సంఘాల ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి ఊకె ముత్యాలరావు, ఆదివాసీ మహాసభ్యురాలు మడకం సునీత, మడకం రజిని మాట్లాడుతూ దేశంలోనీ ఆదివాసీలపై ఈ మధ్య కాలంలో దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆధారమైన జీవో నెం 03 ను సుప్రీంకోర్టు కొట్టేస్తే ప్రభుత్వాలు స్పందించలేదని, అంటే ఆదివాసీలను విస్మరించడమే అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకు సభలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెం 03 కు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రం ఆవిష్కరించారు.

అబ్బుర పరిచిన కూచిపూడి నృత్య రీతులు











చిన్నారుల నృత్య భంగిమలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో 9వ వార్షిక జాతీయ నర్తన బాల అవార్డుల కార్యక్రమం రెండో రోజు ఆదివారం ముగిసింది. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఉదయం నుంచి రాత్రి వరకూ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు కొనసాగాయి. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, తెనాలి, తణుకు, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి ప్రముఖ పట్టణాలు, నగరాల నుంచి పలువురు నాట్యాచార్యులు తమ శిష్యులను ఈ ఉత్సవానికి తీసుకొచ్చి వారి ద్వారా ప్రదర్శనలు ఇప్పించారు. ఈ సందర్భంగా పలు అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు, పలు భక్తి గీతాలకు వారు ప్రదర్శించిన నృత్య విన్యాసాలు అబ్బుర పరిచాయి. చిన్నారులు ప్రదర్శించిన హావభావాలకు ప్రేక్షకులు మంత్రముగ్ధులై తమ చప్పట్లతో వారిని అభినందించారు. కార్యక్రమంలో పలువురు అతిథులు పాల్గొని చిన్నారులకు అవార్డులతో పాటు జ్ఞాపికలు, కప్పులు, సర్టిఫికెట్లు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమాలను అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య దువ్వి హేమ సుందర్ పర్యవేక్షించారు.



నర్తనబాల అవార్డులు అందుకున్న చిన్నారి నర్తకులు

రిటైర్డ్ జవాన్‌కు ఘన సన్మానం



రిటైర్డ్ ఆర్మీ జవానును సన్మానిస్తున్న ఎక్స్ పారామిలిటరీ అసోసియేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సెంట్రల్ పారామిలిటరీ ఫోర్సెస్‌లో 22 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని అస్సాం రాష్ట్రంలోని సిల్చార్‌లో గత నెల 31న పదవీ విరమణ చేసి ఆదివారం తన సొంత ప్రాంతమైన ఏలూరు నగరానికి విచ్చేసిన మెరుగుమాల వీరాస్వామికి ఘన స్వాగతం లభించింది. ఎక్స్ పారామిలిటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వీరాస్వామి సీఆర్‌పీఎఫ్‌లో 22 సంవత్సరాలు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. ఆయన సేవలు ఏలూరు నగర ప్రజలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సోమవరపాటి శ్రీనివాస్, పోలిశెట్టి సత్యనారాయణ, పూజారి రామారావు, చింతాడ కామేశ్వరరావు, శంకరపు ముత్యాల రావు, సత్తుపతి శామ్యూల్, సర్వీసు పర్సన్ కె.బాబూరావు, షేక్ రెహమాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	40-48	ములక్కాడలు	7-10
బెండకాయలు	24	కంద	52
పచ్చిమిర్చి	54	బీట్‌రూట్	36
కాకర కాయలు	50-60	కీరా దోస	50
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	48	అల్లం	100-160
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-56	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణి	--
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - తిరుపతి	16.00	4830	30